RNI. No. APTEL/2011/41055





# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 13 సంచిక : 211 ఆదిలాబాద్ ఎడిటర్ - సయ్యద్ కరీం ఆదివారం, 2 ఫిబ్రవరి 2025 పేజీలు : 4 వెల : 2/-




# వేతన జీవులకు గుడ్ న్యూస్

## రూ. 12 లక్షల వరకూ నో ఇన్‌కం టాక్స్

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా ఎనిమిదోసారి కేంద్ర బడ్జెట్‌ను సమర్పించారు. ఆమె ఫిబ్రవరి 1, 2025, శనివారం ఉదయం 11 గంటలకు పార్లమెంటును ఉద్దేశించి ప్రసంగించారు. ఇది మోడీ 3.0 పాలనలో మొదటి పూర్తి స్థాయి బడ్జెట్ అవుతుంది. బడ్జెట్ రోజుకు కొన్ని రోజుల ముందు, ప్రభుత్వం ఆదాయపు పన్ను చట్టం తెస్తుందని ప్రకటించారు. కొత్త ఆదాయపు పన్ను బిల్లును వచ్చే వారంలో పార్లమెంటుకు సమర్పించనున్నట్లు ఆమె ప్రకటనలో తెలిపారు. బడ్జెట్ లో కొత్త పన్ను విధానం ప్రకారం, వార్షిక ఆదాయం రూ. 12 లక్షల వరకు ఉన్నవారు ఎటువంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. దీని కారణంగా, సాలీనా రూ.25 లక్షల ఆదాయం ఉన్నవారికి రూ.1 లక్ష ప్రయోజనం చేకూరుతుంది. దీంతో పాటు, టీడీఎస్, టీసీఎస్ లను రూ.7 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. అలాగే TDS ప్రక్రియ సరళం చేసేందుకు కూడా చర్యలు తీసుకున్నారు. అలాగే టీడీఎస్ నేర రహితం చేయబడుతుంది. టీడీఎస్ పరిమితి రూ.2.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు ఉంటుంది.

**ఇన్ కం టాక్స్ శ్లాబులపై కీలక పాయింట్లు ఇవే:** రూ. 12 లక్షల సాలీనా ఆదాయం వరకూ ఎలాంటి పన్నులు చెల్లించాల్సిన అవసరం లేదు..స్టాండర్డ్ డిడక్షన్‌తో కలిపితే రూ.12.75 లక్షల వరకు సున్నా పన్ను.

**కొత్త టాక్స్ శ్లాబులు ఇవే:** రూ. 0-4 లక్షల నిల్, రూ. 4 లక్షలు-రూ. 8 లక్షలు: 5%, రూ. 8 లక్షలు-రూ. 12 లక్షలు: 10%, రూ. 12 లక్షలు-16 లక్షలు: 15%, రూ. 16 లక్షలు-20 లక్షలు: 20%, రూ. 20 లక్షలు-24 లక్షలు: 25%, రూ. 24 లక్షల పైన: 30%.

**పాత పన్ను శ్లాబులో మార్పు లేదు:** ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పాత పన్ను శ్లాబ్‌లో ఎలాంటి మార్పులు చేయలేదు. పాత పన్ను శ్లాబ్‌లో గతంలో లాగా రూ.5 లక్షల వార్షిక ఆదాయంపై ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. 50 వేల స్టాండర్డ్ డిడక్షన్ కూడా ఉంది.

**పాత పన్ను విధానం పన్ను స్లాబ్ :** - రూ. 0 నుండి రూ. 2.5 లక్షల వరకు: 0%, - రూ. 2.5 లక్షల నుండి రూ. 5 లక్షల వరకు: 5%, - రూ. 05 లక్షల నుండి రూ. 10 లక్షల వరకు: 20%, - రూ. 10 లక్షల కంటే ఎక్కువ ఆదాయం: 30%. రూ. 12 లక్షల వరకు వార్షిక ఆదాయంపై ఎలాంటి పన్ను ఉండదని బడ్జెట్ సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. అలాగే స్టాండర్డ్ డిడక్షన్ రూ.75000గా నిర్ణయించారు. ఈ నేపథ్యంలో రూ. 12,75,000పై ఎటువంటి పన్ను చెల్లించాల్సిన అవసరం ఉండదు. అంటే వార్షిక ఆదాయం రూ.12 లక్షల 75 వేలు ఉన్న వారు ఒక్క రూపాయి కూడా పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు.

**కేంద్ర వార్షిక బడ్జెట్ ఎంత.. ఏయే శాఖలకు ఎంత కేటాయించారు :** కేంద్ర వార్షిక బడ్జెట్2025-26ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారమన్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. మొత్తం రూ. 50,65,345 కోట్లతో 2025-26 ఏడాది కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్‌లో ప్రధానంగా మధ్యతరగతి ప్రజానీకానికి భారీ ఊరట

## కొత్త ఆదాయపన్ను టాక్స్ శ్లాబులు ఇవే..

లభించింది. రూ.12 లక్షలలోపు ఆదాయం ఉన్నవారికి పూర్తిగా పన్ను మినహాయింపు ఇస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. అలాగే రక్షణ శాఖకు అధికంగా నిధులు కేటాయించింది కేంద్రం. ఏఏ రంగాలకు ఎంత మేరకు బడ్జెట్‌లో నిధులు కేటాయించారో ఇప్పుడు చూద్దాం.

**వివిధ శాఖలకు కేటాయింపులు ఇవే..** రక్షణ రూ. 4,91,732 కోట్లు, గ్రామీణాభివృద్ధి రూ. 2,66,817 కోట్లు, హోం రూ. 2,33,211 కోట్లు, వ్యవసాయ, అనుబంధ రంగానికి రూ. 1,71,437 కోట్లు, విద్య రూ. 1,28,650 కోట్లు, ఆరోగ్య రూ. 98,311 కోట్లు, పట్టణాభివృద్ధి రూ. 96,777 కోట్లు, ఐటి, టెలికం రూ. 95,298 కోట్లు, విద్యుత్ రూ. 81,174 కోట్లు, వాణిజ్య, పరిశ్రమలు రూ. 65,553 కోట్లు, సామాజిక సంక్షేమం రూ. 60,052కోట్లు, వైజ్ఞానికి విభాగాలకు రూ. 55,679 కోట్లు/

**కేంద్రానికి వచ్చే ఆదాయం...** ఆదాయపన్ను నుంచి 22 శాతం, కేంద్ర ఎక్సైజ్ నుంచి 5 శాతం, జీఎస్టి, ఇతర పన్నుల నుంచి 18 శాతం. కార్పొరేషన్ పన్ను ద్వారా 17 శాతం, కస్టమ్స్ ద్వారా... 4 శాతం, అప్పులతో కాని క్యాపిటల్ రిసిప్ట్స్ ద్వారా 1 శాతం, పన్నేతర ఆదాయం 9 శాతం, అప్పులు, ఇతర మార్గాల ద్వారా 24 శాతం ఆదాయం సమకూరుతుంది.

**కేంద్ర ఖర్చులు....** వడ్డీ చెల్లింపులకు 20 శాతం, కేంద్ర ప్రభుత్వ పథకాలకు 16 శాతం, కీలక సబ్సిడీలకు 6 శాతం, రక్షణ రంగానికి 8 శాతం, రాష్ట్రాలకు పన్నులు, డ్యూటీల ద్వారా చెల్లింపుల్లో 22 శాతం, ఫైనాన్స్ కమిషన్, ఇతర బదిలీల ద్వారా 8 శాతం, కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలకు 8 శాతం, ఇతర ఖర్చులకు 8 శాతం, పెన్షన్స్‌లకు 4 శాతం.



## 140 కోట్ల ప్రజల ఆశలు నెరవేర్చే బడ్జెట్ ఇది: ప్రధాని మోదీ

కేంద్రంలో ఎన్డీయే సర్కార్ మూడోసారి కొలువుదీరిన తర్వాత ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్‌పై ప్రధాని నరేంద్రమోదీ స్పందించారు. ఇది 140 కోట్ల ప్రజల ఆశలు నెరవేర్చే బడ్జెట్ అని కొనియాడారు. దీంతో పొదుపు, పెట్టుబడులు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ పద్దు దేశాన్ని వికసిత్ భారత్ వైపు అడుగులు వేయిస్తుందని పేర్కొన్నారు. 'భారత అభివృద్ధి ప్రయాణంలో ఈ బడ్జెట్ ఒక ముఖ్యమైన మైలురాయి. ఇది 140 కోట్ల మంది భారతీయుల ఆకాంక్షలు నెరవేర్చే బడ్జెట్. అనేక రంగాల్లో యువతకు అవకాశాలను కల్పిస్తున్నాం. బడ్జెట్‌లు సాధారణంగా ఖజానాను నింపడంపై దృష్టి సారిస్తాయి. కానీ.. ఈ బడ్జెట్ మాత్రం ప్రజల జేబులు నింపేందుకు, సేవింగ్స్ పెంచేందుకు ఉద్దేశించింది. ఈ బడ్జెట్‌లో రూ.12 లక్షల వరకూ ఎలాంటి పన్ను లేదు. అన్ని ఆదాయ వర్గాలకు పన్నులను తగ్గించారు. ఇది మధ్య తరగతి ప్రజలకు ఎంతో ప్రయోజనకరం" అని ప్రధాని పేర్కొన్నారు.



## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్.. 8 మంది మావోయిస్టులు మృతి

ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం మరోసారి కాల్పుల మోతతో దద్దరిల్లింది. బీజాపూర్ జిల్లా గంగలూర్ అటవీ ప్రాంతంలో ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో 8 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. గంగలూరు పోలీసు స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో పశ్చిమ బస్తర్ డివిజన్ మావోయిస్టులు నక్కినట్లు నిఘా వర్గాల నుంచి సమాచారం రావడంతో.. డీఆర్‌జీ, సీఆర్పీఎఫ్, కోబ్రా యూనిట్, ఎస్‌టీఎఫ్ బలగాలు యాంటీ నక్సలైట్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో భద్రతా దళాలను చూసిన మావోయిస్టులు కాల్పులకు తెగబడ్డారు. దీంతో సిబ్బంది ఎదురుకాల్పులు జరిపి మావోయిస్టులను హతమార్చారు. ఉదయం 8.30 గంటలకు మొదలైన ఎన్‌కౌంటర్ ఇంకా కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు. అడవుల్లో మావోయిస్టుల కోసం గాలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఘటనాస్థలంలో ఆటోమేటిక్ ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు

## కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు సున్నా: టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్



హైదరాబాద్: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ 2025-26లో తెలంగాణకు ఇచ్చింది సున్నా అని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. తెలుగు కోడలు అయి ఉండి కూడా నిర్మలమ్మ తెలంగాణపై ప్రేమ చూపలేదన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని అసహనం వ్యక్తం చేశారు. భాజపా తెలంగాణపై వివక్ష చూపిస్తోందని.. రాజకీయంగా రాష్ట్రాన్ని దెబ్బతీయాలని చూస్తోందని ఆరోపించారు. త్వరలో బిహార్ అసెంబ్లీ ఎన్నికలు ఉండడంతో అక్కడ రాజకీయ లబ్ధి కోసం భాజపా కేంద్ర బడ్జెట్‌ను ఉపయోగించుకుంటోందని మండిపడ్డారు. తెలంగాణకు ఎన్నికల సమయంలో ప్రధాని మోదీ, భాజపా నాయకులు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎంపీలు.. కేంద్ర మంత్రులను, ప్రధాన మంత్రిని కలిసి తెలంగాణకు రావాల్సిన అనేక అంశాలపై విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా కేంద్రం తెలంగాణకు అవసరమైన అంశాల్లో సహకారాన్ని అందించాలని కోరారు.




## అసెంబ్లీ సీట్లు పెరుగుతున్నాయి..

## మొదలైన ప్రక్రియ..!

హైదరాబాద్ / అమరావతి : ఏపీలో అన్ని రాజకీయ పార్టీలు ఎదురు చూస్తున్న అసెంబ్లీ, పార్లమెంటు సీట్లను పెంచే క్రతువు ప్రారంభం కానుంది. విభజన చట్టం ప్రకారం.. రాష్ట్రానికి మరో 50 అసెంబ్లీ సీట్లు రావాల్సి ఉంది. ఇక, నియోజక ర్గాల పునర్ విభజన ప్రకారం.. 5-8 పార్లమెంటు స్థానాలు కూడా పెరగాల్సి ఉంది. వీటిపై ఎప్పటికప్పుడు చర్చ జరుగుతున్నా.. అడుగులు ముందుకు పడడం లేదు. కానీ, పార్టీలకు మాత్రం నియోజకవర్గాలు పెంచితే.. తమకు ఇబ్బందులు తప్పుతాయన్న అభిప్రాయం కనిపిస్తోంది. రాష్ట్రంలో నాయకుల సంఖ్య పెరుగుతోంది. యువతను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్న పార్టీలు కనిపిస్తున్నాయి. అదేసమయంలో అనూహ్య కారణాలతో కొత్త నేతలు కూడా అప్పటికప్పుడు పుట్టుకువస్తున్నారు. ఉదాహరణకు బాపట్ల ఎంపీ.. కృష్ణ ప్రసాద్ కొత్త నాయకుడు. అప్పటి వరకు రాజకీయ నేపథ్యం తక్కువే. కానీ, ఎన్నికల సమయంలో ఆయన టికెట్ పొందారు. దీనివల్ల.. సీనియర్లు, టికెట్ ఆశించిన వారు కూడా తప్పుకోవాల్సి వచ్చింది. ఇక, ఇతర నియోజకవర్గాల్లోనూ.. సిట్టింగులను తప్పించారు. ఇక, వైసీపీ విషయానికి వస్తే.. కొత్తతరం నాయకులను రాజకీయాలకు పరిచయం చేస్తోంది. దీంతో సీనియర్లను తప్పించి.. సామాజిక వర్గాల ఆధారంగా టికెట్లను పంపిణీ చేసింది. ఈ రెండు పార్టీల పరిస్థితి నాయకులు ఎక్కువ-అవకాశాలు తక్కువ అన్నట్టుగా మారింది. దీంతో వైసీపీ, టీడీపీలు రెండూ కూడా.. గతంలో అధికారంలో ఉనప్పుడు.. అసెంబ్లీ సీట్ల పెంపుపై కసరత్తు చేశాయి. 2017-18 మధ్య చంద్రబాబు దీనిపై పెద్ద తీర్మానమే చేసి కేంద్రానికి ఇచ్చారు. అయినప్పటికీ.. 2026 వరకు కుదరదని అప్పట్లో కేంద్రం తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలో తాజాగా ఏపీ, తెలంగాణలకు పునర్విభజన చట్టం ప్రకారం అసెంబ్లీ, దేశవ్యాప్తంగా జనాభా ఆధారంగా పార్లమెంటు నియోజకవర్గాలను పెంచేందుకు కేంద్రం కసరత్తు ప్రారంభించింది. దీనిపై పార్లమెంటు ఆమోదం పొందాల్సిన నేపథ్యంలో బడ్జట్ సమావేశాల రెండో విడతలో నియోజకవర్గాల పునర్ విభజనపై ముసాయిదా బిల్లును తీసుకురానున్నట్టు తెలిసింది. ఈ ప్రక్రియ ఇప్పుడు మొదలైతే.. ఆరు మాసాల సమయం పట్టనుంది. దీనిని తిరిగి ఈ ఏడాది ఆమోదిస్తే.. వచ్చే ఏడాది నుంచి నియోజకవర్గాల పెంపు జరుగుతుందని భావిస్తున్నారు.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## కాంగ్రెస్ పునరుత్తేజానికి బీజేపీ బాటలు పరుస్తోందా ?

ఏపీలో రాజకీయం కాస్తా మూడు ప్రాంతీయ పార్టీల మధ్యనే కేంద్రీకృతమైంది. ఇందులో రెండు పెద్ద పార్టీలు ఉంటే మరో పార్టీ ఇపుడిపుడే బలాన్ని పెంచుకుంటోంది. ఇక చూస్తే 2014 నుంచి ఏపీ రాజకీయాల్లో జాతీయ పార్టీల పాత్ర నామమాత్రం అయింది. బీజేపీకి తెలుగుదేశంతో పొత్తు ఉంటేనే సీట్లు దక్కుతున్నాయి. లేకపోతే ఆ పార్టీ ఓటమి పాలు అవుతోంది. ఇది గడచిన మూడు ఎన్నికల్లో జరిగిన ఉదంతంగా చూస్తున్నారు. అయితే బీజేపీ గెలిచిన ప్రతీ సారి తన గొప్పతనం అనుకుంటోంది. ఏపీలో తాను బలపడాలని చూస్తోంది. 2014లో టీడీపీ అండతో జనసేన మద్దతుతో గెలిచిన బీజేపీ పరోక్షంగా వైసీపీతో దోస్తీ చేసి ఆ పార్టీకి ఊతం ఇచ్చింది అన్న ఆరోపణలు ఉన్నాయి. దాని వల్లనే విషయం మొత్తం చెడి 2018 నాటికల్లా టీడీపీ ఎన్డీయే నుంచి బయటకు రావడం జరిగింది. బీజేపీ ఆనాడు వైసీపీతో కలసి ఏపీలో రాజకీయంగా బలపడాలని అనుకుంది. అయితే 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైసీపీ కేంద్ర ప్రభుత్వానికి పరోక్షంగా సాయం అందించింది కానీ బీజేపీతో పొత్తుని బాహాటంగా కుదుర్చుకునేందుకు ఒప్పుకోలేదు. ఫలితంగా మళ్ళీ టీడీపీతోనే పొత్తుకు సిద్ధపడాల్సి వచ్చింది. మరో వైపు చూస్తే 2014 కి 2024 కి మధ్యలో ఏపీ రాజకీయాల్లో భారీ మార్పులు వచ్చాయి. నాడు ఎన్నికల్లో పోటీ చేయని పవన్ జనసేన 2019లో సొంతంగా పోటీ చేసి ఉనికిని చాటుకుంది. ఇక 2024 నాటి కూటమి ఏర్పాటులో కీలకమైన పాత్ర పోషించి పవన్ ఏపీ రాజకీయాల్లో కీలకంగా మారారు. ఇక పవన్ కి సినీ సెలబ్రిటీగా విపరీతమైన క్రేజ్ ఉంది. అంతే కాదు ఏపీలో బలమైన సామాజిక వర్గం దన్ను ఉంది. మరే రాజకీయ నేతకూ లేనంతగా యువత మహిళల మద్దతు ఉంది. దాంతో బీజేపీ పవన్ మీద కోటి ఆశలను పెంచుకుంది. పవన్ ని ముందు పెట్టుకుని రేపటి రోజున ఏపీలో బలపడాలని చూస్తోంది. ఈ క్రమంలో జగన్ తో బీజేపీకి అసలు అవసరం అన్నది లేదని అంటున్నారు. ఏపీలో పవన్ ప్లస్ బీజేపీ బలపడాలి అంటే పొలిటికల్ వాక్యూం క్రియేట్ కావాలని కమలనాధులు ఆలోచిస్తున్నారు. టీడీపీకి అపోజిట్ గా ఉన్న వైసీపీ నిర్వీర్యం కావడం వల్లనే ఆ రాజకీయ శూన్యత ఏర్పాడుతుందని అంచనా కడుతున్నారు. దానికి అవసరమైన ఇంధనాన్ని బీజేపీ ఇపుడు సమకూర్చి పెడుతోంది. వైసీపీని బీజేపీ గట్టిగా టార్గెట్ చేయడం వెనక ఉద్దేశ్యాలు వ్యూహాలు ఇవేనని అంటున్నారు. వైసీపీ అంతలా బలహీనం అయితే ఆ ప్లేస్ లో జనసేన బీజేపీ ఎమర్జ్ కావడానికి వీలు ఉంటుందని భావిస్తున్నారు. అయితే ఏపీలో జనసేన బీజేపీ టీడీపీల ఓటు బ్యాంక్ దాదాపుగా ఒక్కటే అని విశ్లేషణలు ఉన్నాయి. వైసీపీ ఓటు బ్యాంక్ అన్నది కాంగ్రెస్ నుంచి ట్రాన్స్ ఫర్ అయి వచ్చింది. మైనారిటీలు దళితులు బలమైన రెడ్డి సామాజిక వర్గం ఇలా వైసీపీ ఓటు బ్యాంకు ఉంది. అది ఎంత గట్టిది అన్నది 2024 ఎన్నికల్లో రుజువు అయింది అని గుర్తు చేస్తున్నారు. మూడు పార్టీలు కలసినా వైసీపీకి పడే ఓట్లను కదిలించలేక పోయారు అంటే అది వైసీపీ ఓటు బ్యాంకు గానే చూడాల్సి ఉందని అంటున్నారు. అంతే కాదు బీజేపీకి వ్యతిరేక భావజాలానికి వేరే రాజకీయ సిద్ధాంతానికి ఆ ఓటు బ్యాంకు నిదర్శనం అంటున్నారు. ఈ వర్గాలు వైసీపీ ఏపీలో బలంగా ఉందని అట్టిపెట్టుకొని ఉన్నాయి. అదే వైసీపీ వీక్ అయితే తిరిగి కాంగ్రెస్ ని ఆశ్రయిస్తాయి తప్పించి కూటమిలోని ఏ ఒక్క వర్గమూ వైపు వచ్చే సీన్ ఉండదని అంటున్నారు. ఏపీలో సాగుతున్న ఆపరేషన్ వైసీపీ వల్ల జగన్ రాజకీయంగా ఇబ్బంది పడితే ఆ ప్లేస్ లోకి జనసేన బీజేపీ కాంబో రావడం అంత సులువు కాదని అంటున్నారు. అదే టైం లో కాంగ్రెస్ ఎదిగేందుకు బ్రహ్మాండమైన చాన్స్ ఉంటుందని విశ్లేషిస్తున్నారు. బీజేపీ ఏపీలో బలపడేందుకు అవసరమైన రాజకీయ భూమిక లేదని కూడా గుర్తు చేస్తున్నారు. మొత్తం మీద బీజేపీ 2014 నుంచి 2019 వరకూ అనుసరించిన స్ట్రాటజీని మార్చి ఇపుడు జగన్ ని టార్గెట్ చేయడం వల్ల కాంగ్రెస్ కి మంచి రోజులు రావచ్చు అన్నది ఒక విశ్లేషణ గా ఉంది. మరి వైసీపీ అయితే ఎంత మేరకు వీటిని తట్టుకుని నిలబడుతుంది అన్నది చూడాల్సి ఉంది అంటున్నారు.

# భాషా నైపుణ్యం.. వ్యక్తిత్వ వికాసం



పెద్దపల్లి : ఆంగ్ల భాషా నైపుణ్యం, వ్యక్తిత్వ వికాసం పెంపొందించేందుకు ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఆంగ్లంలో ప్రయోగ పరీక్ష నిర్వహిస్తున్నారు. గతేడాది తొలిసారిగా ప్రథమ సంవత్సరం విద్యార్థులకు అమలు చేయగా, ఈసారి ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఏర్పాటు చేశారు. మొత్తం వంద మార్కులకు గాను ప్రయోగాలకు 20 కేటాయించగా, మిగతా 80 మార్కులకు పరీక్ష రాయాల్సి ఉంటుంది. నాలుగు దశల్లో నిర్వహించే ప్రయోగ పరీక్షలో కనీసం 7 మార్కులు వస్తేనే ఉత్తీర్ణత సాధించనున్నారు. పరీక్షలకు గైర్హాజరైన విద్యార్థులను అనుత్తీర్ణులుగా ప్రకటిస్తున్నారు. ఈ నెల 31, ఫిబ్రవరి 1వ తేదీల్లో పరీక్ష నిర్వహించనున్నారు.

**నాలుగు విడతల్లో నిర్వహణ**

ప్రయోగ పరికరాలతో కాకుండా తరగతి గదిలోనే విద్యార్థుల భాషా సామర్థ్యాలను పరీక్షిస్తారు.

మొదటి దశలో ఒక అంశంపై ఇద్దరు, అంతకంటే ఎక్కువ మంది విద్యార్థుల మధ్య ఆంగ్ల సంభాషణను అధ్యాపకులు పరీక్షిస్తారు.

రెండో దశలో 'జస్ట్ ఎ మినిట్' పేరిట ఒక అంశంపై నిమిషంలోపు అనర్గళంగా మాట్లాడాల్సి ఉంటుంది.

మూడో దశ 'రోల్‌ప్లే'లో తల్లిదండ్రులు, లేక మరేదైనా అంశంపై విద్యార్థుల మధ్య బృంద చర్చ ఉంటుంది.

నాలుగో దశ 'లిజనింగ్ కంప్రహెన్సివ్'లో వినే శక్తి పెంపొందించడంపై అధ్యాపకులు పరీక్షిస్తారు.

చివరగా విద్యార్థుల రాసిన రికార్డులను తనిఖీ చేసి మార్కులు కేటాయిస్తున్నారు.

**31 నుంచి ప్రయోగ పరీక్ష**

ఉమ్మడి జిల్లాలో మొత్తం 197 కళాశాలల్లో 41,861 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ చదువుతున్నారు. ఆంగ్ల ప్రయోగ పరీక్షను ఈ నెల 31న ప్రథమ సంవత్సరం వారికి, ఫిబ్రవరి 1న ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహిస్తారు. పరీక్షలో మొదటి మూడు దశలను కళాశాల యజమాన్యం వెసులుబాటు ఆధారంగా నిర్వహించారు. చివరి విడతలో మాత్రం ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించిన తేదీలో ఏర్పాటు చేయాలి. విద్యార్థుల భవితకు కొలమానంగా ఉన్న ఈ పరీక్ష నిర్వహణపై ఉన్నతాధికారులు పకడ్బందీగా పర్యవేక్షిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో నామమాత్రంగా కాకుండా విద్యార్థుల ప్రతిభ ఆధారంగా పరీక్ష నిర్వహించనున్నారు.

**నేడు పర్యావరణ విద్య**

ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు గతంలో విలువలు, పర్యావరణ విద్య పరీక్షలు నిర్వహించేవారు. ఇందులో ప్రాజెక్టు రూపొందించి నివేదిక సమర్పిస్తే 40 మార్కులు, పరీక్షకు మరో 60 మార్కులు కేటాయించేవారు. గతేడాది విలువల విద్య రద్దు చేసి పర్యావరణ విద్యపై మాత్రమే పరీక్ష నిర్వహిస్తున్నారు. గురువారం ఈ పరీక్ష నిర్వహించనున్నారు.

**తప్పనిసరిగా హాజరు కావాలి**

విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించేందుకు ప్రయోగ పరీక్ష నిర్వహిస్తున్నాం. ఇందులో తప్పనిసరిగా ఉత్తీర్ణులు కావాల్సి ఉంటుంది. 20 మార్కులు కేటాయించడంతో పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రతి విద్యార్థి తప్పకుండా హాజరు కావాలి.కల్పన, ఇంటర్మీడియట్ పెద్దపల్లి జిల్లా నోడల్ అధికారి

ఉమ్మడి జిల్లాలో ఇంటర్ విద్యార్థులు

కరీంనగర్ 12,641
జగిత్యాల 11,887
పెద్దపల్లి 10,566
రాజన్న సిరిసిల్ల 6,767

# ఠాణా గడప తొక్కని గిరిజన పల్లె



ధర్మపురి: సమష్టి జీవనానికి ప్రతీకగా నిలుస్తోంది ధర్మపురి మండలంలోని ఆకుసాయిపల్లె గ్రామం. వందశాతం గిరిజనులు ఉన్న ఈ గ్రామం నుంచి ఎవరూ ఠాణా మెట్లెక్కలేదు. వివాదాలు, ఘర్షణలు ఏమీ తెలియని పల్లె. ఇక్కడి ప్రజలంతా శాంతి, సహనాలతో, సోదర భావంతో మెలుగుతున్నారు. దశాబ్దాలుగా ఒకరికి ఒకరు అండగా ఉంటూ ఎలాంటి వివాదాలు లేకుండా జీవనం గడుపుతున్నారు. ధర్మపురి నుంచి జగిత్యాల వైపు వెళ్లే జాతీయ రహదారి పక్కనే ఉంది ఈ పల్లె. **అభివృద్ధిలో...**

ప్రభుత్వ పథకాల అమలులో సైతం ఇక్కడి ప్రజలు ఆదర్శంగా నిలుస్తున్నారు. స్వచ్ఛత, పరిశుభ్రత, మొక్కల పెంపకంలో అందరు కలిసికట్టుగా భాగస్వాములవుతున్నారు. ఈ పల్లెలో ఏడు స్వశక్తి సంఘాలుండగా, రూ.20 లక్షల వరకు రుణాలు తీసుకున్నారు. వాటిని సమృద్ధిగా వినియోగించుకుంటూ సంఘాల పటిష్ఠతకు కృషి చేస్తున్నారు. ప్రాథమిక పాఠశాలలో 30 మంది విద్యార్థులున్నారు. పిల్లలకు మెరుగైన విద్యాబుద్ధులు నేర్పేందుకు వారి తల్లిదండ్రులు కృషి చేస్తున్నారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా విద్యార్థులను పాఠశాలకు పంపుతున్నారు. ప్రధాన రోడ్ల వెంట మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతలను విద్యార్థులకు అప్పగిస్తున్నారు. ఈ గ్రామం అయిదేళ్ల క్రితం నూతనంగా పంచాయతీగా ఏర్పడింది. పల్లె ప్రగతి కార్యక్రమాన్ని ఇక్కడ వంద శాతం చేపట్టారు. సమీపంలోని చెరువే స్థానికులకు ప్రధాన నీటి వనరు. ఈ చెరువు కిందే పత్తి, వరి, మొక్కజొన్న పంటలను సాగు చేస్తున్నారు. పదేళ్ల క్రితం వరకు ఏమాత్రం సదుపాయాలు లేని ఈ పల్లెలో నేడు మెరుగైన రహదారులు, అంతర్గత సీసీ రోడ్లు, మురుగు కాలువలు, తాగు నీరు, విద్యుత్తు సరఫరా, అంగన్‌వాడీ కేంద్రాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నారు.

**వర్షాధారంగానే పంటలు**

ఆకుసాయిపల్లె గ్రామంలో వర్షాధారంగానే పంటలను పండిస్తున్నారు. నేరెళ్ల గుట్టపై నుంచి వచ్చే నీరు సమీపంలోని బ్రాహ్మణకుంట వద్దకు చేరుతుంది. చెక్‌డ్యాం నిర్మాణం చేపట్టి ఈ నీటి ఆధారంగానే సాగు చేస్తున్నారు. మిర్చి, మొక్కజొన్న, పత్తి పంటలను పండిస్తున్నారు.

**రికార్డులోనే లేదు**

ధర్మపురి మండలంలో 29 గ్రామాలుండగా ఆకుసాయిపల్లె నేటికీ పోలీసు రికార్డులోకి ఎక్కలేదు. మిగతా అన్ని గ్రామాల్లో వివిధ రకాల కేసులు నమోదయ్యాయి. ఈ పల్లెల్లో ప్రజలు సోదర భావంతో మెలుగుతున్నారు. ఈ గ్రామం సమష్టి జీవనానికి ప్రతిబింబంగా నిలుస్తోంది. ఉదయ్ కుమార్, ఎస్సై, ధర్మపురి

**ఏళ్లతరబడి ఐకమత్యంగా**

గ్రామంలో ఎవరికి ఏ ఆపద వచ్చినా అందరం స్పందించి అండగా నిలుస్తాం. ఎవరి ఇంట్లో వేడుక జరిగినా అందరం కలిసికట్టుగా జరుపుకుంటాం. గ్రామ అభివృద్ధికి సమష్టిగా నిర్ణయాలు తీసుకుంటాం. ఏళ్లుగా ఎటువంటి వివాదాలకు తావివ్వలేదు. ఇది మాకు గర్వకారణం. నూతన పంచాయతీ కావడంతో కొద్దిపాటి నిధులు మాత్రమే వచ్చాయి. వాటిని పొదుపుగా వాడుకుంటూ అందరి సహకారంతో అభివృద్ధికి పనులు చేపట్టాము. రమేష్, మాజీ సర్పంచి, ఆకుసాయిపల్లె

# ఆక్రమణలకు కోట

భువనగిరి : భువనగిరి కోట భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. నియంత్రించాల్సిన సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోకపోవడంతో కోట మూడు వైపులా నిర్మాణాల పరంపర కొనసాగుతోంది. ప్రస్తుతం కోట పురావస్తుశాఖ ఆధీనంలో ఉంది. ఈ శాఖ అధికారుల స్థానికంగా ఉండకపోవడంతో కోట ఆస్తులపై పర్యవేక్షణ కొరవడిందన్న ఆరోపణలు ఉన్నాయి. సర్వే నంబర్ 212లోని సుమారు 45 ఎకరాల విస్తీర్ణంలో కోట ఆవరించి ఉంది. దీనికి చెంతనే ఉన్న అమ్మకుంట పరిసరాల్లో మూడెకరాలు, ప్రధాన రహదారి ముఖ్యకూడలి సమీపంలో అర ఎకరం ప్రభుత్వ భూమి ఉంది. కోట భూములకు సర్వే నిర్వహించి గత కొన్నేళ్ల క్రితం మార్కింగ్ చేశారు. కోట పరిధి నుంచి వంద మీటర్ల పరిధిలోని నిషేధిత జోన్‌లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదు. గతంలో ఈ జోన్‌లో పూర్తయిన నిర్మాణాలకు పురావస్తుశాఖ అధికారులు సంబంధించిన వారికి నోటీసులు, మున్సిపల్ అధికారులకు, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికి నేటికీ చర్యలు చేపట్టకపోవడంతో ఆక్రమణలు, అనుమతులు లేని నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. కోట కొత్తబస్టాండ్‌తో పాటు హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి, పట్టణ ప్రధాన రహదారి వరకు ఆవరించి ఉంది. మరో వైపు అమ్మకుంట, పలు వెంచర్లు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో భూమి ఖరీదుగా మారింది. దీంతో కోటకు ఆనుకుని సొంత భూములు ఉన్న వారు కోట వరకు నిర్మాణాలు చేపట్టారు. ఇటీవలి కోట పరిధిలోని కోట గడ్డను తవ్వి మట్టిని తరలించినప్పటికి ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై పురావస్తుశాఖ ఏడీ నాగలక్ష్మిని వివరణ కోరగా ఇప్పటికే పలువురికి నోటీసులు ఇచ్చామని, స్థానిక అధికారులకు ఫిర్యాదు చేశామని వివరణ ఇచ్చారు. ప్రస్తుత పరిస్థితిపై తమ ఉన్నతాధికారులకు నివేదికను సమర్పిస్తామని ఆమె తెలిపారు.

# గోదా'వరి'తో సాగు

సిద్దిపేట : యాసంగిలో చాలా మంది రైతులు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల ఆధారంగావరి పంట వేశారు. ఈసారి సుమారు 3 లక్షల ఎకరాలకుపైగా సాగయ్యే అవకాశాలున్నట్లు అధికారుల అంచనా. ఇది మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వడంతో కర్షకులు వరి వైపు మొగ్గుచూపుతున్నారు. ఇప్పటికే వేసిన నాట్ల కొన్ని చోట్ల ఎండిపోతుండటంతో ప్రాజెక్టుల నుంచి సాగునీరు వదలాలని రైతులు డిమాండు చేస్తున్నారు. జిల్లాలో పలు చోట్ల ఇటీవల ఆందోళనలు సైతం చేపట్టారు. ఫిబ్రవరి రెండో వారం వరకు నాట్లు పూర్తి కానున్నాయి. సాగుకు గోదావరి జలాలు ఆదరువు కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా 1.20 లక్షల ఎకరాల ప్రత్యక్ష ఆయకట్టుంది. చెరువులు, వాగులు, కుంటల్లోకి



నీరు చేరితేనే పంటలు గట్టెక్కనున్నాయి.

**నీటి పారుదల శాఖ మంత్రికి వినతి**

బోర్లు తట్టి పోస్తుండటం, చెరువు, కుంటలు, వాగుల్లో నీరు లేకపోవటంతో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయని, ప్రభుత్వం వెంటనే గోదావరి జలాలు విడుదల చేయాలని రైతులు డిమాండు చేస్తున్నారు. కర్షకుల పక్షాన ఇటీవలే దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన అధికారులు మల్లన్నసాగర్ నుంచి కొండపోచమ్మ కాలువ ద్వారా కూడవెల్లి వాగులోకి నీటిని విడుదల చేశారు. చెక్‌డ్యామ్‌లు నిండిన తర్వాత వారం అనంతరం నిలిపేస్తామని అధికారులు చెబుతున్నారు. గోదావరి జలాలు విడుదల చేయక వెలవెలబోతున్న హల్దీవాగు చెక్‌డ్యామ్

**రంగనాయక్ సాగర్ ఎడమ కాలువ ద్వారా..**

జనవరి 18న మంత్రి కొండా సురేఖ రంగనాయక సాగర్ ఎడమ కాలువ ద్వారా నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం కొనసాగుతోంది. కుడి కాలువకు విడుదల చేయాల్సి ఉంది. కొండపోచమ్మ సాగర్ నుంచి రామాయంపేట, జగదేవపూర్ కాలువ ద్వారా రోజుకు సుమారు 65 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. హల్దీవాగు, గజ్వేల్ కెనాల్‌కు నీటిని విడుదల చేయాల్సి ఉంది. గతేడాది ఫిబ్రవరిలో అవసరమైన మేర గోదావరి నీటిని వదిలామని, ప్రస్తుతం ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరిస్తామని నీటి పారుదల శాఖ గజ్వేల్ ఈఈ మోతియా తెలిపారు.

ప్రస్తుత నీటి నిల్వ(టీఎంసీలలో)

అనంతగిరి 3.01
రంగనాయక సాగర్ 2.34
మల్లన్నసాగర్ 17.5
కొండపోచమ్మసాగర్ 9.1

# తుది పని.. జాప్యం ఎందుకని?

సంగారెడ్డి : పేదల వైద్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. సర్కారు దవాఖానాలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దాలని సంకల్పించింది. నూతన భవనాల నిర్మాణాలకు రూ.కోట్లలో నిధులు మంజూరు చేసింది. కొన్ని చోట్ల ఆయా నిర్మాణాలు తుది దశకు చేరుకున్నప్పటికీ.. కొద్దిపాటి పనులనూ పూర్తి చేయడం లేదు. గుత్తేదారులు అర్జీ పెట్టుకోవడం.. అధికారులు పనుల పూర్తికి గడువు పొడిగించడం సాధారణంగా మారింది.

**పటాన్‌చెరులో రూ.70 కోట్లతో..**

పటాన్‌చెరులోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో సూపర్ స్పెషాలిటీ దవాఖానా భవన నిర్మాణానికి గతేడాది రూ.70 కోట్ల నిధులు మంజూరయ్యాయి. పరికరాల బిగింపునకు అదనంగా రూ.25 కోట్లు కేటాయించారు. పీసీబీ, ప్రభుత్వం సంయుక్తంగా చేపట్టిన భవనాల పనులు చివరి దశకు చేరుకున్నాయి. రంగులు తదితర పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. రూ.5 కోట్ల బిల్లుల బకాయిలు ఉండటంతో పనులు నిలిచిపోయాయి. ఏప్రిల్ వరకు ఆసుపత్రి భవనాలను వినియోగంలోకి తీసుకొస్తామని అధికారులు చెబుతున్నారు.

**రంగులు వేసి.. తలుపులు బిగించాలి**

సంగారెడ్డికి మూడేళ్ల క్రితం ప్రభుత్వ వైద్య కళాశాల మంజూరయింది. ఇందులో భాగంగా జిల్లా ఆసుపత్రి ఆవరణలో ఏడాదిన్నర క్రితం రూ.23.75 కోట్లలో 'క్రిటికల్ కేర్ యూనిట్' భవనం పనులు ప్రారంభించారు. 95 శాతం పనులు పూర్తిచేశారు. కలరింగ్, విద్యుత్తు కనెక్షన్లు, తలుపుల బిగింపు తదితర తుది పనులు మాత్రమే మిగిలి ఉండగా.. గుత్తేదారు జాప్యం చేస్తున్నారు.



**జహీరాబాద్‌లో మాతాశిశు ఆరోగ్య కేంద్రం..**

జహీరాబాద్‌లోని మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రం(ఎంసీహెచ్) భవన నిర్మాణానికి ప్రభుత్వం గతేడాది రూ. 7.5 కోట్ల నిధులు విడుదల చేసింది. రెండంతస్తుల పనులు పూర్తయ్యాయి. రంగులు, ఇతర తుది పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. రూ.3 కోట్ల వరకు గుత్తేదారుకు బిల్లులు చెల్లించాల్సి ఉండటంతో నత్తనడకన పనులు సాగుతున్నాయి. ఏప్రిల్ చివరి నాటిని పనులన్నీ పూర్తి చేస్తామని అధికారులు వివరిస్తున్నారు.

**నర్సింగ్ విద్యార్థులకు 'అద్దె' కష్టాలు**

సంగారెడ్డి పట్టణం రామచంద్రారెడ్డి నగర్‌లో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, విద్యార్థులకు వసతి గృహాల కోసం 2022లో రూ.34 కోట్లు మంజూరయ్యాయి. జీప్లస్-2 భవనం కోసం స్లాబ్ వేశారు. బిల్లుల సమస్యతో గుత్తేదారు పనులు నిలిపివేశారు. అద్దె భవనంలో నర్సింగ్ విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

వేగవంతం చేశాం..: రవీందర్‌రెడ్డి, ఈఈ, టీఎస్ఎంఎస్ఐడీసీ

జిల్లాలో ఆసుపత్రుల భవనాలు, నర్సింగ్ కళాశాల, వసతి గృహాల భవనాల పనులు గతంతో పోల్చితే వేగవంతమయ్యాయి. బిల్లుల చెల్లింపునకు ప్రాధాన్యం ఇస్తున్నాం. మార్చి, ఏప్రిల్ నాటికి భవనాలను వినియోగంలోకి తేవాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఇటీవల లక్ష్యాన్ని నిర్దేశించారు. ఆ దిశగా ముందుకు సాగుతున్నాం.

# వస్త్ర పరిశ్రమకు ఊతం

సిరిసిల్ల : రాష్ట్రంలోని మరమగ్గాల వస్త్రోత్పత్తిలో ఉమ్మడి జిల్లాదే ప్రథమస్థానం. రోజుకు సగటున 20 లక్షల మీటర్ల కాటన్, పాలిస్టర్ వస్త్రం ఉత్పత్తి జరుగుతోంది. ఇవి స్థానిక అవసరాలకే తప్ప జాతీయ, అంతర్జాతీయ ఎగుమతులకు నోచుకోవడం లేదు. వస్త్రం నాణ్యతకు ఉపయోగపడే ప్రాసెసింగ్ యూనిట్‌లు అందుబాటులో లేకపోవడమే ఇందుకు కారణం. ఇటీవల సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్కులోని పరిశ్రమల యజమానులు కేంద్ర ప్రభుత్వ ఎంఎస్ఎంఈ (సూక్ష్మ, చిన్న, మధ్య తరహా)లో ఎస్‌పీవీ (స్పెషల్ పర్పస్ వెహికల్)లో నమోదు చేసుకుంటున్నారు. ప్రస్తుతం టెక్స్‌టైల్ పార్కులో పని చేస్తున్న 60 యూనిట్లలో 20 మంది వరకు నమోదు చేసుకున్నారు. దీనిలో కనిష్ఠంగా 25 యూనిట్లు మొదలు ఎంతమందికైనా అవకాశం ఉంది. ఈ పథకంలో కేంద్రం రూ.30 కోట్ల వరకు మంజూరు చేసే



అవకాశం ఉంది. ప్రస్తుతం పార్కులో రూ.10 కోట్లతో సీఎఫ్‌సీ (ఉమ్మడి వసతుల కేంద్రం) ఏర్పాటుకు నిర్ణయించారు. యజమానులు 5 శాతం, కేంద్రం 80 శాతం, 15 శాతం రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వనుంది. దీనిలో కేంద్రం ఇచ్చేది గ్రాంటు రూపంలో ఉంటుంది. ఇప్పటికే పార్కులోని యజమానులంతా రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించారు.

**ఫలించని ప్రతిపాదనలు**

వస్త్ర పరిశ్రమలో తీసుకురావాల్సిన మార్పుల్లో ఉమ్మడి వసతుల కేంద్రం ప్రధానమైంది. మరమగ్గాల ఆధునికీకరణ, అనుబంధ రంగాల ప్రోత్సాహానికి ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 38 వేల మరమగ్గాలుండగా, సిరిసిల్ల పట్టణం, టెక్స్‌టైల్ పార్కులో అధునాతనమైన 30 వేల మరమగ్గాలున్నాయి. వీటిపై ఉత్పత్తి అవుతున్న ముడి వస్త్రాలను హైదరాబాద్, ముంబయి, సూరత్‌లోని ఫినిషింగ్, ప్రాసెసింగ్‌కు పంపుతున్నారు. ఇక్కడ సీఎఫ్‌సీ ఏర్పాటుకు 15 ఎకరాల స్థలం సిద్ధంగా ఉంది. 15 ఏళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం కోసం వస్త్ర పరిశ్రమ వర్గాలు ఎదురుచూస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో రూ.108 కోట్లతో డీపీఆర్‌ను కూడా సిద్ధం చేశారు. దీనిలో మొదటి దశ రూ.46.66 కోట్లు, రెండో దశ రూ.62.21 కోట్లుగా నిర్ణయించారు. బడ్జెట్‌లో కేటాయిస్తారని అంతా ఆశించినా ఫలితం లేకుండా పోయింది.


**ప్రయోజనాలు ఇవీ...**ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సిరిసిల్ల, కరీంనగర్, గర్శకుర్తి ప్రాంతాల్లో ఉత్పత్తి అవుతున్న వస్త్రాలకు ప్రీ వీవింగ్, పోస్ట్ వీవింగ్ ప్రక్రియకు సీఎఫ్‌సీ ప్రధానం. దీనిలో వస్త్రోత్పత్తులకు ముందు నూలు సైజింగ్, వార్పింగ్, డైయింగ్ చేస్తారు. వస్త్రం ఉత్పత్తి అయ్యాక ఫినిషింగ్, ప్రాసెసింగ్, డైయింగ్, ఫ్యాబ్రికేషన్, డిజైనింగ్, డిజిటల్ ప్రింటింగ్ వంటివి ఈ కేంద్రంలో అందుబాటులో ఉంటాయి. ఈ ప్రక్రియల ద్వారానే వస్త్రం నాణ్యత ప్రమాణాలకు గుర్తింపు లభిస్తుంది. ఫలితంగా జిల్లా వస్త్రోత్పత్తుల రంగంలో దేశ వ్యాప్తంగా ప్రత్యేకమైన చోటు సంపాదించే అవకాశం ఉంటుంది. ఉమ్మడి జిల్లాకు సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్కు కేంద్రంగా వస్త్రోత్పత్తుల హబ్‌గా మారుతుంది.

**ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయి**

ఆధునిక మరమగ్గాలపై వస్త్రోత్పత్తులు జరుగుతున్నా ఇప్పటికీ ప్రత్యేక గుర్తింపు లేదు. సీఎఫ్‌సీ ఏర్పాటుతో ఉత్పత్తిదారులంతా నాణ్యమైన ఎగుమతి రకాలపై దృష్టి సారిస్తారు. దీంతో పన్నుల రూపంలో ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. కార్మికులు ఇతర అనుబంధ రంగాల్లో ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయి. అన్నల్‌దాస్ అనిల్, టెక్స్‌టైల్ పార్కు వస్త్రోత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు

# ధైర్యం నూరిపోసేందుకు.. ఓ కార్యం

భువనగిరి : పదోతరగతి వార్షిక పరీక్షలు మార్చి 21 నుంచి జరగనున్నాయి. మెరుగైన ఫలితాలు సాధించాలనే సదాశయంతో జిల్లా విద్యాశాఖ ముందస్తు జాగ్రత్తలు చేపడుతోంది. ఇప్పటికే పది విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ కొనసాగుతుండగా.. తాజాగా వారిని మానసికంగా, శారీరకంగా సన్నద్ధం చేయాలనే సంకల్పంతో 'కెరీర్ కౌన్సెలింగ్ అండ్ గైడెన్స్' పేరిట నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఉన్నత పాఠశాల, ఆదర్శ, కేజీబీవీ, గురుకులాలకు సంబంధించి ఒక్కో ఉన్నత పాఠశాలకు ఒక ఉపాధ్యాయుడు చొప్పున ఎంపిక చేసి, జిల్లా కేంద్రాల్లో ఈ నెల 30, 31 తేదీల్లో రెండు రోజులపాటు స్టేట్ రిసోర్స్ పర్సన్ (ఎస్ఆర్పీ)లతో తర్ఫీదునివ్వనున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా 667 మంది పాఠశాల స్థాయి ఆర్పీలకు రెండు రోజుల పాటు శిక్షణ జరగనుంది. వీరిద్వారా క్షేత్రస్థాయిలో పదోతరగతి వార్షిక పరీక్షలు రాసే విద్యార్థులకు విద్యాపరంగా మెలకువలు చెప్పడమే కాకుండా వ్యక్తిగత, శారీరక, మానసిక సన్నద్ధత అంశాలపై అవగాహన కల్పించనున్నారు. ఎస్సీఈఆర్టీ, విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ వినూత్న కార్యక్రమం అమలుతో పదో తరగతి పరీక్షలు రాయగోరు విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుందని విద్యాశాఖ భావిస్తుంది. ఆర్పీల అవగాహనతో విద్యార్థులకు ప్రయోజనం సత్యనారాయణ, జిల్లా విద్యాధికారి, యాదాద్రి భువనగిరి



జిల్లా కేంద్రంలో ఎస్సార్పీల ద్వారా రెండు రోజుల పాటు పాఠశాల స్థాయి ఆర్పీలకు అందించే శిక్షణ పదో తరగతి విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుంది. వారు చేపట్టాల్సిన అంశాలతో కూడిన మాడ్యూల్స్ కూడా అందిస్తున్నాం. రానున్న పదో తరగతి వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నాం.

అవగాహన కల్పించే అంశాలు..

యుక్త వయసులో వచ్చే శారీరక, మానసిక సమస్యలు గుర్తించి అవగాహన కల్పించడంమాదకద్రవ్యాల వినియోగం వల్ల నష్టాలు, విపరీత ధోరణులు వివరిం చడం ఆందోళనకు గురికాకుండా ఉండటం, సున్నిత మనస్కులకు ధైర్య వచనాలు చెప్పడం సమయం సద్వినియోగం చేసుకోవడమే కాకుండా పరీక్షలంటే భయం పోగొట్టడం.పరీక్షల్లో వచ్చే ప్రశ్నలకు సరైన సమాధానాలు రాసే విధానం నేర్పడం.పదోతరగతి అనంతర విద్యా విషయాలు (కెరీర్ గైడెన్స్) తెలుపుతూ వారిలో ఉత్తేజాన్ని నింపడం.

# ప్రత్యేక పాలన.. ప్రగతి సాధించేనా?



కరీంనగర్ : కరీంనగర్ నగరపాలికతోపాటు మున్సిపాలిటీల్లో పాలకవర్గ పదవీకాలం ముగిసి ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైంది. ఇప్పటి వరకు సమస్యలను వార్డు కౌన్సిలర్లు, కార్పొరేటర్ల దృష్టికి తీసుకొచ్చారు. వీటిని ఛైర్మన్, మేయర్ ద్వారా కమిషనర్లకు తెలిపి అప్పటికప్పుడు పరిష్కరించారు. పాలకవర్గ సభ్యులు మాజీలు కావడంతో అధికారులపై భారం పెరిగింది. ఆయా డివిజన్, వార్డు అధికారులతోపాటు కమిషనర్లు కనీస సౌకర్యాలపై దృష్టి సారించాల్సి ఉంటుంది. నగరపాలికకు ప్రత్యేకాధికారిగా జిల్లా కలెక్టర్, మున్సిపాలిటీలకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రత్యేకాధికారిగా కొనసాగుతున్న నేపథ్యంలో నగర, పురపాలికల్లోని సమస్యలు త్వరితిగతిన పరిష్కరించి, అభివృద్ధి పనుల్లో పరుగులు పెట్టించాలని ప్రజలు కోరుతున్నారు.

**అసంపూర్తి పనులతో అవస్థలు**

నగరంలో ముఖ్యమంత్రి హామీ నిధులతో ఏడాదిన్నర కిందట ప్రగతి పనులు ప్రారంభించినా సగం పెండింగ్‌లో ఉన్నాయి. ఎక్కడికక్కడే తవ్వి వదిలేశారు. సాధారణ నిధులతో టెండర్లు నిర్వహించగా ఇటీవల పలు చోట్ల శంకుస్థాపనలు చేశారు. వీటిని ప్రారంభించాల్సి ఉంది. నిలిచిపోయిన స్మార్ట్‌సిటీ పనులు పూర్తి చేయాల్సి ఉంది.

**పారిశుద్ధ్యం అధ్వానం**

శివారు కాలనీలు, విలీన గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు అధ్వానంగా ఉన్నాయి. ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగాయి. చెత్త సేకరించే ఆటో కార్మికులు రెండు, మూడు రోజులకోసారి వస్తున్నట్లుగా ఫిర్యాదులు వస్తున్నాయి. దోమల బెడద పెరుగుతుండగా అన్ని డివిజన్‌లలో ఫాగింగ్ జరిగేలా చూడాల్సిన అవసరముంది.

**తాగునీరు.. లీకేజీలు**

నగరవ్యాప్తంగా పైపులైన్ల లీకేజీలకు లెక్కే లేదు. మరమ్మతుల్లో జాప్యం చేస్తున్నారు. అంబేడ్కర్ నగర్, తదితర రిజర్వాయర్ల పరిధిలో ఆశించిన స్థాయిలో నీటి సరఫరా జరగడం లేదు. ట్యాంకులు నిండకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సూర్యనగర్, సీతారాంపూర్, విద్యారణ్యపురి, సరస్వతీనగర్, తీగలగుట్టపల్లి ప్రాంతాల్లో వేసవి వస్తే చాలు తాగునీటికి కుస్తీలు పడాల్సి వస్తోంది.

**విలీన గ్రామాలపై దృష్టి**

ప్రభుత్వం ఇటీవల కొత్తపల్లి మున్సిపాలిటీతోపాటు చింతకుంట, మల్కాపూర్-లక్ష్మీపూర్, దుర్శేడ్, గోపాల్‌పూర్, బొమ్మకల్ పంచాయతీలను కార్పొరేషన్‌లో విలీనం చేసింది. ఇక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా కనీస సౌకర్యాలు మెరుగు పర్చేలా ప్రత్యేకంగా దృష్టి సారించాలి.

**వెలగని వీధి దీపాలు**

నగరంలో వీధిదీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఏజెన్సీకి రూ.కోట్లు చెల్లించాల్సి ఉండటంతో విడిభాగాలు సరఫరా నిలిపివేశారు. వీధి దీపాలు వెలగకపోతే మరమ్మతులు చేసే వారు లేకుండా పోయారు. మరోవైపు స్మార్ట్‌సిటీలో భాగంగా బిగించిన వీధి దీపాలు వెలగడం లేదు. అశోక్‌నగర్, గాంధీరోడ్డు, విద్యానగర్ తదితర ప్రాంతాల్లో లైట్లు ఉన్నా పని చేయడం లేదు.

# వరుస చోరీలు.. జనం బెంబేలు



కరీంనగర్ : అశోక్‌నగర్‌లో నివాసముంటున్న మురుగం అంజని కుటుంబం ఇటీవల ఇంటికి తాళంవేసి వరంగల్ వెళ్లారు. తిరిగి వచ్చిచూడగా బీరువాలో కుమార్తె వివాహానికి దాచిన నగదు, ఆమె మనవరాలికి చెందిన 35 తులాల బంగారు ఆభరణాలు, రూ.3.70 లక్షల నగదు, 80 తులాల వెండి వస్తువులు అపహరణకు గురయ్యాయి.

మూడునెలల క్రితం కరీంనగర్ రాంగనర్‌లో ఓ దొంగ ఏకంగా సీసీ కెమెరా దిశను మార్చి ఇంట్లో చోరీకి పాల్పడ్డాడు. అయితే మారుస్తుండగా.. దొంగ చిత్రం సీసీ ఫుటేజీలో ఉన్నప్పటికి కేసును చేధించడంలో పోలీసులు విఫలమయ్యారు. నిత్యం ఎక్కడో ఒకచోట దొంగతనం జరుగుతుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

ఈ నెల 18 రాత్రి కొత్తపల్లి మండలం చింతకుంటలోని రెండు కాలనీల్లో తాళం వేసిన మూడు ఇళ్లలో చోరీలు జరిగాయి. రూ.లక్షల విలువైన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, నగదు చోరీకి గురయ్యాయి. పోలీసులు మాత్రం చోరీ విషయాన్ని బయట పెట్టకుండా వారం వరకు కేసు నమోదు చేయకుండా గోప్యంగా ఉంచుతున్నారు.

**ఆభరణాలు వెంట తీసుకెళ్లాలి**

సాధారణంగా దొంగల ముఠాలు తాళాలు వేసి ఉన్న ఇళ్లనే లక్ష్యంగా ఎంచుకుంటారు. పండుగలు, శుభకార్యాలకు వెళుతున్నవారు ఇంటికి తాళం వేసి వెళ్తారు. ఇలాంటి సమయంలో ఇరుగుపొరుగువారికి, పోలీసులకు సమాచారం అందించాలి. లేదా బంగారు ఆభరణాలు, నగదును తమవెంట తీసుకువెళ్లాలి. ఇంట్లో ఉన్నప్పటికీ దొంగల దాడిని ఎదుర్కోవడానికి అన్నిరకాల సిద్ధంగా ఉండాలి.

**సాంకేతికతో ఇంటికి రక్షణ**

ఇంటిని దొంగల బారినుంచి కాపాడుకునేందుకు సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉంది. సీసీ కెమెరాలు, ఆలారాలు, వైర్లను కత్తిరిస్తే తెలిపే ట్యాంపర్ ప్రూఫ్, వీడియో డోర్ ఫోన్, డిటెక్టర్ లాంటివి నాణ్యత ఆధారంగా రూ.1500 నుంచి రూ.15 వేల వరకు మార్కెట్‌లో లభిస్తున్నాయి. యజమానులు ఇంట్లో లేనప్పుడు ఇవి అప్రమత్తం చేస్తాయి.

**పాత చోరులపై నిఘా**

పోలీసులు గస్తీ ముమ్మరం చేయాల్సి ఉంది. ఇదివరకు దొంగతనం జరిగిన ప్రాంతాల్లో సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారా లేదా అన్న అంశాలపై పోలీసు ఉన్నతాధికారులు దృష్టి కేంద్రీకరిస్తే చోరీలను అరికట్టే అవకాశముంది. ఇంతకుముందు చోరీచేసిన దుండగులు జైలు నుంచి విడుదలైతే వారి కదలికలు గమనిస్తూ ఉండాలి. వారి సమాచారం సీసీఎస్ పోలీసుల నుంచి సేకరించి విచారణ చేపడితే ఫలితం ఉంటుంది. అర్ధరాత్రి దాటాక తక్కువ నిమిషాల వ్యవధిలో సొత్తును దోచుకెళ్లే ముఠాలపై నిఘా పెట్టాలి.

# మూత్రపిండ బాధితులకు సాంత్వన



పెద్దపల్లి : జీవనశైలిలో మార్పులు, జన్యుపరమైన లోపాలు, మధుమేహం, రక్తపోటు వంటి రుగ్మతల కారణంగా జిల్లాలో మూత్రపిండ వ్యాధిగ్రస్థుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. బాధితుల్లో రక్త శుద్ధీకరణ ప్రక్రియ సాఫీగా జరగకపోవడంతో ప్రాణాప్రాయ పరిస్థితులకు చేరుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో జిల్లాలో బాధితులకు పెద్దపల్లి, గోదావరిఖని, మంథని ప్రభుత్వ ఆసుపత్రుల్లోని డయాలసిస్ కేంద్రాలు అండగా నిలుస్తున్నాయి. ఇటీవల మంథని ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలు అందుబాటులోకి రావడంతో మారుమూల ప్రాంతాల బాధితులకు దూరాభారం తగ్గింది.

**పేదలకు మెరుగైన వైద్యం**

ఇప్పటివరకు మంథని ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రం లేకపోవడంతో ముత్తారం, కమాన్‌పూర్, రామగిరి మండలాలతో పాటు జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్, కాటారం మండలాల్లోని రోగులు గోదావరిఖని, పెద్దపల్లి ఆసుపత్రులకు వెళ్లి వ్యయ ప్రయాసలకు గురయ్యారు. పేద రోగులకు ఆర్థిక భారంగా మారింది. ఒక్కోసారి చేతిలో డబ్బులు లేక సమయానికి ఆసుపత్రికి వెళ్లలేని పరిస్థితి ఉండేది. రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాలతో జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఎట్టకేలకు మంథనిలో సేవలు అందుబాటులోకి రావడంతో పేదలకు మెరుగైన సేవలు అందనున్నాయి.

**మూడు కేంద్రాల్లో 15 పడకలు**

జిల్లాలో మొదట దాదాపు రెండేళ్ల కిందట గోదావరిఖని సార్వజనిక ఆసుపత్రిలో డయాలసిస్ సేవలను ప్రారంభించారు. అంతకుముందు జిల్లావాసులు కరీంనగర్‌లోని ప్రైవేటు దవాఖానాలకు వెళ్లాల్సి వచ్చేది. అనంతరం ఏడాది కిందట పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించారు. దాదాపు నెల రోజుల కిందట మంథనిలో సేవలు అందుబాటులోకి వచ్చాయి. జిల్లాలోని మొత్తం మూడు కేంద్రాల్లో 15 పడకలుండగా 77 మంది రోగులకు సేవలందిస్తున్నారు.

**దూరాభారం తప్పింది**

ఆరు నెలలుగా పెద్దపల్లికి వెళ్లి డయాలసిస్ చేయించుకుంటున్నా. వారానికి మూడు సార్లు 45 కి.మీ.ల దూరంలోని పెద్దపల్లికి వెళ్లి రావడంతో వ్యయ ప్రయాసలు తప్పడం లేదు. ఇటీవల మంథనిలోనే కేంద్రం ప్రారంభించడంతో దూరాభారం తప్పింది. సులువుగా వెళ్లగలుగుతున్నా. తిరుపతి, ఉప్పట్ల, మంథని మండలం

# మత్తు వదిలిస్తున్నారు!

సిరిసిల్ల: మద్యం తాగడం వ్యసనంగా మారి చాలామంది జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.. గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసలవుతున్నవారూ ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్నారు.. నాలుగు జిల్లాల్లో నెలకు రూ.200 కోట్ల మద్యం వ్యాపారం సాగుతుండటం.. ఏటా 20వేలకు పైగా డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదవుతుండటం మద్యానికి బానిసలవుతున్న తీరును తెలియజేస్తోంది. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల్లో 2024 ఏప్రిల్‌లో డీ-అడిక్షన్ కేంద్రాలను ప్రారంభించడంతో ఉచితంగా సేవలు అందుతుండగా, ప్రత్యేకంగా సిబ్బందిని నియమించకపోవడం లోటుగా ఉంది. దీంతోపాటు ఈ కేంద్రాలపై ప్రచారం లేకపోవడంతోనూ కొంతమంది ఎక్కువ డబ్బులు వెచ్చించి ఇతర ప్రాంతాల్లోని ప్రైవేటు డీ అడిక్షన్ కేంద్రాలకు వెళ్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల్లో నేషనల్ యాక్షన్ ప్లాన్ ఫర్ డ్రగ్ డిమాండ్ రిడక్షన్ (ఎన్ఏపీడీడీఆర్) పథకంలో డీ-అడిక్షన్ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. నాలుగు ఆసుపత్రుల్లోనూ ఎన్‌సీడీ (అసాంక్రమిక వ్యాధుల) విభాగం సైకియాట్రిస్టులే సేవలను అందిస్తున్నారు. ఎక్కడా ప్రత్యేకంగా విభాగం లేదు. ఈ చికిత్సలకు ప్రతి ఆసుపత్రిలో ప్రత్యేకంగా పది పడకలు ఏర్పాటు చేశారు. మద్యానికి బానిసలైన వారు సిరిసిల్లలో నెలకు సగటున 140, రామగుండంలో 120 మంది వస్తున్నారు. జగిత్యాల, కరీంనగర్ ఆసుపత్రుల్లో అందించే చికిత్సలను ఎన్‌సీడీలోని మానసిక విభాగంలో కలుపుతున్నారు. ఓపీకి వచ్చినవారిలో 30శాతం మంది మద్యం బానిసలు ఉంటున్నారని ఆ విభాగం అధికారులు చెబుతున్నారు. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో నెలకు సగటున 500ల మంది వరకు సేవలు పొందుతున్నట్లు అంచనా

సిరిసిల్లలో 40 ఏళ్ల వ్యక్తి మద్యానికి బానిసయ్యాడు. చేసే పనిలో శ్రద్ధ లేకుండా పోవడంతో పనికి పిలిచేవారు తగ్గిపోయారు. ఇంట్లో గొడవలు మొదలయ్యాయి. కాలనీలో జరిగిన అవగాహన సదస్సులో డీ-అడిక్షన్ కేంద్రం గురించి తెలుసుకున్న కుటుంబసభ్యులు సిరిసిల్ల కేంద్రానికి తీసుకెళ్లగా నెల రోజుల్లో సాధారణ స్థితికి చేరి పని చేసుకుంటున్నాడు. కరీంనగర్‌లో ఓ యువకుడికి మద్యంతోపాటు గంజాయి అలవాటైంది. కళాశాలకు దుమ్మాకొట్టడం, మిత్రులతో కలిసి మద్యం, గంజాయి తాగడం వ్యసనంగా మారింది. ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఒకసారి పోలీసులకు పట్టుబట్టాడు. కుటుంబ సభ్యులకు జనరల్ ఆస్పత్రిలో డీ అడిక్షన్ కేంద్రం ఉన్న విషయం తెలియక హైదరాబాద్‌లోని ప్రైవేటు కేంద్రానికి తీసుకెళ్లారు. చికిత్సకు రూ.వేలల్లో ఖర్చవుతోందని అతని కుటుంబం వాపోతోంది.

డీ అడిక్షన్ కేంద్రాలకు వచ్చే బాధితులకు తొలుత వైద్య పరీక్షలు చేస్తారు. హిమోగ్లోబిన్ శాతం, కాలేయం, మూత్రపిండాల పనితీరు, మానసిక స్థితులను పరిశీలిస్తారు. తీవ్రతను బట్టి మందులు ఇస్తారు. బాధితులు, కుటుంబ సభ్యులకు మద్యపానంతో వచ్చే దుష్పరిణామాలు వివరించడంతోపాటు ఆ వ్యసనాల నుంచి విముక్తి కల్పించేలా కౌన్సెలింగ్ ఇస్తారు. బాధితుని ఆరోగ్య పరిస్థితిని బట్టి అలవాటు మానడానికి 1 నుంచి 3 నెలల సమయం పడుతుందని వైద్యులు చెబుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా అందించే ఈ చికిత్స ప్రైవేటులో అయితే వేలాది రూపాయలు వెచ్చించాల్సి ఉంటుంది.

చికిత్సకు వచ్చేవారిలోనూ కొందరు మధ్యలోనే వెళ్లిపోతున్నారు. ఇక గంజాయి, కల్తీ కల్లు, ఇతర మత్తు పదార్థాలు తీసుకునేవారిని ఈ కేంద్రాలకు తీసుకు రావడం చాలా తక్కువ అని సిబ్బంది చెబుతున్నారు.

డీ-అడిక్షన్ కేంద్రాల్లో నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనల ప్రకారం ఇద్దరు సైకియాట్రిస్టు ప్రొఫెసర్లు, ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు, నర్సు, అటెండర్లు ఉండాలి. కాగా జనరల్ ఆస్పత్రుల్లోని కేంద్రాలకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించలేదు. నాలుగు జిల్లాల్లోని జనరల్ ఆస్పత్రి ఎన్‌సీడీ విభాగాల్లో ఒక సైకియాట్రిస్టు, ఇద్దరు నర్సులు, ఒక అటెండరు చొప్పున ఉండగా వారే డీ అడిక్షన్ కేంద్రానికి వచ్చేవారికి సేవలు అందిస్తున్నారు.

# గిరి ప్రదక్షిణ ఎప్పుడో..!

నీలగిరి : త్రేతాయుగంలో పరుశరాముడు స్థాపించిన 108 శివలింగాల్లో చిట్టచివరి శివలింగం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి అని భక్తుల నమ్మకం. పురాతన ఆలయంగా ప్రసిద్ధిగాంచిన చెర్వుగట్టు శివాలయాన్ని అనేక మంది యోగులు, పీఠాధిపతులు సందర్శించారు. పుట్టుకతో అంధుడైన పోతులపాటి సోమశర్మ చాలాకాలం పాటు ఆలయ అనువంశిక అర్చకుడిగా అనేక రకాల పూజా కార్యక్రమాలు నిర్వహించారు. హంపి విరూపాక్షానందస్వామి ఆలయాన్ని దర్శించుకుని అమావాస్య రోజు నిద్ర చేసి గిరి ప్రదక్షిణ నిర్వహించి స్వామివారిని దర్శించుకుంటే.. శివపార్వతులు అనుగ్రహిస్తారని తెలిపారు. స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు ఈ విషయం చెప్పగా శివసత్తులతో మొదలైన అమావాస్య నిద్ర నేడు వేలాది మంది భక్తులు వచ్చేలా చేసింది. అమావాస్య నిద్ర చేస్తున్న భక్తులకు గిరిప్రదక్షిణ చేయలేకపోతున్నామనే ఆవేదనను సోమశర్మ భక్తులకు చెప్పేవారు. నేటికి ఇది భక్తులకు తీరని కలగానే మిగిలిపోయింది. అనువంశిక పూజారి సోమశర్మ బతికుండగా పీఠాధిపతి సూచించిన విధంగా గిరి ప్రదక్షిణ ఏర్పాటు చేయాలని భావించారు. కానీ కొన్ని కారణాల చేత ఆగిపోయారు. గుట్ట చుట్టూ



సుమారు 3 కిలోమీటర్లు దారి వేసి గిరిప్రదక్షిణ కోసం ప్రయత్నాలు జరిగాయి. ప్రస్తుతం చెర్వుగట్టు బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో గిరిప్రదక్షిణ మరోసారి చర్చల్లోకి వచ్చింది.

**ప్రయత్నాలు చేసినా..పోతులపాటి రామలింగేశ్వరశర్మ, ఆలయ ప్రధాన అర్చకులు**మా అన్న సోమశర్మ ఆలయంలో అనేకమంది పీఠాధిపతులు, పండితులు సూచించిన విధంగా పూజలు విస్తరించారు. అమావాస్య రోజు ఆలయ ఆవరణలో నిద్రచేసి స్వామివారిని దర్శించుకోవాలనే అంశం అలా వచ్చిందే. గిరి ప్రదక్షిణ చేసిన భక్తులకు శివపార్వతులు తోడుగా ఉంటారని నమ్మకంతో అనేక ప్రయత్నాలు చేసినా ఫలితం రాలేదు. స్వామివారు కరుణిస్తే జరుగుతుందనే నమ్మకంతో ఉన్నాం.




## కాంగ్రెస్ నేతల రహస్య సమావేశం.. ఫోన్ చేసినా..

తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో ముసలం మొదలైందని వార్తలు వస్తున్నాయి. 10 మంది హస్తం పార్టీ ఎమ్మెల్యేలు ఓ హోటల్‌లో రహస్యంగా సమావేశం అయ్యారని పుకార్లు వస్తున్నాయి. ఒక మంత్రి తమను పట్టించుకోవడం లేదని ఆరోపణలు చేసినట్లు సమాచారం. తమ నియోజకవర్గంలో తమకు తెలియకుండానే మంత్రి నిర్ణయాలు తీసుకుంటున్నారని ఎమ్మెల్యేలు అసహనం వ్యక్తం చేశారని వినిపిస్తోంది. బీఆర్ఎస్ నేతలకు ప్రభుత్వంలో పనులు అవుతున్నాయని, కానీ సొంత పార్టీ ఎమ్మెల్యేలకు మాత్రం ఆలస్యం చేస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారని తెలుస్తోంది. ఈ రూమర్స్‌పై ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అలర్ట్ అయింది. మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య సమన్వయంపై ఫోకస్ చేస్తోందని తెలిసింది. పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ ఎమ్మెల్యేలకు ఫోన్ చేసి కలసి మాట్లాడుకుందామని సముదాయించారని సమాచారం.




దిల్లీ: వైద్య విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ శుభవార్త చెప్పారు. దేశవ్యాప్తంగా వైద్య సీట్లను పెంచబోతున్నట్లు వెల్లడించారు. ఈమేరకు శనివారం ప్రకటించిన కేంద్ర బడ్జెట్-2025లో ఆమె పేర్కొన్నారు. వచ్చే ఏడాది నుంచి సంవత్సరానికి కనీసం 10 వేలు చొప్పున పెంచేందుకు కేంద్రం సిద్ధమైందన్నారు. ఇలా రానున్న ఐదేళ్లలో 75 వేల సీట్లు పెంచుతామన్నారు. మరోవైపు, దేశవ్యాప్తంగా ఉన్న మొత్తం 23 ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీస్ (ఐఐటీ)కు కూడా నిర్మలమ్మ గుడ్‌న్యూస్ చెప్పారు. దేశ వ్యాప్తంగా ఉన్న 23 ఐఐటీలలో అదనపు మౌలిక సదుపాయాలు కల్పించాలని నిర్ణయించారు. పదేళ్ల క్రితం ఐఐటీ సీట్ల సంఖ్య 65 వేలు ఉండగా.. ప్రస్తుతం 1.35 లక్షలకు చేరింది. అంటే దాదాపు 100శాతానికిపైగా పెరిగింది. ఈ నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అదనపు మౌలిక సదుపాయాలను కల్పించనున్నారు. ముఖ్యంగా 2014 తర్వాత ప్రారంభించిన ఐదు ఐఐటీలలో అదనంగా 6,500 మంది విద్యార్థులు చదువుకునేందుకు వీలుగా ప్రణాళికలు వేశారు. నైపుణ్యాభివృద్ధి, ఉన్నత విద్యలో పెట్టుబడులపై దృష్టిసారించడంలో భాగంగా దేశవ్యాప్తంగా ఐదు నేషనల్ సెంటర్స్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కేంద్రాలను స్థాపించనున్నట్లు సీతారామన్ తెలిపారు. 'మేక్ ఇన్ ఇండియా, మేక్ ఫర్ ది వరల్డ్'కు అవసరమైన నైపుణ్యాలను నేర్చుకునేందుకు, అందుకనుగుణంగా యువతను సన్నద్ధం చేయడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. సుమారు రూ.500 కోట్లతో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫర్ ఎడ్యుకేషన్‌ను ఏర్పాటుచేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు.




ఆర్థిక వృద్ధికి కీలకమైన వాటిలో వ్యవసాయం ఒకటని బడ్జెట్ ప్రసంగంలో భాగంగా కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఆహార భద్రత లక్ష్యంతో.. సులభంగా రుణాలు అందేలా, వ్యవసాయ రంగంలో నిరుద్యోగితను పరిష్కరించేలా, వలసలు తగ్గించే లా, సాంకేతికతను మరింత అందుబాటులోకి తెచ్చేలా మంత్రి ప్రకటనలు చేశారు.

**పీఎం ధన ధాన్య కృషి యోజన..** తక్కువ ఉత్పాదకత, పంట దిగుబడి మధ్యస్థంగా ఉండే వెనకబడిన 100 జిల్లాల్లో వ్యవసాయానికి ప్రోత్సాహం అందించే పీఎం ధన ధాన్య కృషి యోజన పథకాన్ని కేంద్రం ప్రకటించింది. దీనికింద కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేస్తాయి. గోదాములు, నీటిపారుదల, రుణ సౌకర్యాల కల్పన, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను అవలంభించడం, పంచాయతీ, బ్లాక్ స్థాయిల్లో పండించిన పంట నిల్వలను పెంచడం ద్వారా 1.7 కోట్ల గ్రామీణ రైతులకు లబ్ధి చేకూర్చడం దీని లక్ష్యం. గ్రామీణ ఆర్థికవ్యవస్థకు ఊతమిచ్చేలా అవకాశాలను సృష్టించడమే లక్ష్యమని మంత్రి తెలిపారు. దీనిద్వారా పొట్టచేత పట్టుకొని వలస పోయేవారికి తగ్గించగలుగుతామని ఆమె ఆశాభావం వ్యక్తంచేశారు.

**కిసాన్ క్రెడిట్ కార్డుల పరిమితి పెంపు..** రైతులకు పంట సాగు కోసం పెట్టుబడులు అవసరమైనప్పుడు అధిక వడ్డీ రేట్లతో అప్పులు చేయకుండా తక్కువ వడ్డీకే సమయానుసారం రుణాలు అందిస్తాయి కిసాన్ క్రెడిట్ కార్డులు. దీని పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచుతున్నట్లు నిర్మలమ్మ వెల్లడించారు. వ్యవసాయం, మత్స్య, పశుసంవర్ధక రంగాల్లో రైతులు, అవసరమైన పరికరాల కొనుగోలు, ఇతర ఖర్చులకు స్వల్పకాలిక రుణం పొందొచ్చు. దీంతో 7.7 కోట్ల మంది రైతులకు ప్రయోజనం కలగనుంది.

**పప్పుధాన్యాల కోసం ఆత్మనిర్భరత మిషన్..** వంట నూనెల్లో స్వయంసమృద్ధి కోసం ఎడిబుల్ ఆయిల్‌సీడ్ నేషనల్ మిషన్‌ను అమలుచేయనుంది. కంది, మినుములు, మసూర్‌లో స్వయంసమృద్ధి కోసం ఆరు సంవత్సరాల కాలానికి మిషన్ ఫర్ ఆత్మనిర్భరత ఇన్ పల్సెస్‌ను ప్రభుత్వం తీసుకురానుంది. దీనికింద తమతో ఒప్పందాలు చేసుకున్న రైతుల నుంచి కేంద్ర ఏజెన్సీలు ఈ పప్పులను కొనుగోలు చేస్తాయి.

## రూ. 12 లక్షల వరకు పన్ను మినహాయింపు.. విప్లవాత్మక నిర్ణయం: బండి సంజయ్



దిల్లీ: దేశ గతినే మార్చే అద్భుతమైన బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. బడ్జెట్ 2025-26.. పేద, మధ్య తరగతి, యువత, రైతు సంక్షేమ బడ్జెట్‌గా ఆయన పేర్కొన్నారు. 2027 నాటికి అమెరికా, చైనా తర్వాత మూడో ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించే దిశగా బడ్జెట్ రూపకల్పన ఉందన్నారు. ఈ మేరకు బండి సంజయ్ ఓ ప్రకటన విడుదల చేశారు. వేతన జీవులకు రూ. 12 లక్షల వరకు పన్ను మినహాయింపు ఇవ్వడం విప్లవాత్మక నిర్ణయం అని కొనియాడారు. కిసాన్ క్రెడిట్ కార్డుల కోసం రైతులంతా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తెలంగాణలో 50 లక్షల మందికి పైగా రైతులు రూ. 5లక్షల వరకు రుణం పొందే అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు బండి సంజయ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర బడ్జెట్‌పై విపక్షాలు అనవసర విమర్శలు మానుకోవాలని.. కేంద్రానికి సహకరించాలని సూచించారు.

# కేంద్ర బడ్జెట్‌పై నేతల రియాక్షన్ ఎలా ఉందంటే...









హైదరాబాద్, ఫిబ్రవరి 1: లోక్‌సభలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. కేంద్ర బడ్జెట్‌పై రాష్ట్రానికి చెందిన పలు పార్టీల నేతలు స్పందించారు. ఒక్కో నేత ఒక్కో విధంగా బడ్జెట్‌కు సంబంధించి మాట్లాడారు. బీజేపీ నేతలు బడ్జెట్ అద్భుతమని కొనియాడగా, బీఆర్ఎస్ నేతలు తెలంగాణకు మరోసారి అన్యాయం చేశారని మండిపడ్డారు. ఇక కాంగ్రెస్ నేతలు అయితే బడ్జెట్‌పై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ బడ్జెట్ బీహార్, ఢిల్లీ ఎన్నికల కోసం పెట్టినట్టు ఉందంటూ వ్యాఖ్యలు చేశారు. బడ్జెట్‌పై నేతలు ఏ విధంగా స్పందించారో ఇప్పుడు తెలుసుకుందాం.

**వారిని దృష్టిలో పెట్టుకునే బడ్జెట్: మల్లు రవి...** ఢిల్లీ, బీహార్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కేంద్ర బడ్జెట్ తయారు చేసినట్టు ఉందని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి అన్నారు. ఐదు సార్లు బడ్జెట్‌లో బీహార్ అంశాలను ప్రస్తావించారన్నారు. బడ్జెట్‌లో తెలంగాణ అంశం కానీ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు గురించి మాట్లాడ లేదని తెలిపారు. విభజన హామీలు, ట్రైబల్ యూనివర్సిటీ గురించి చెప్పలేదని.. ఈ ప్రభుత్వం వ్యాపారస్తుల ప్రభుత్వం అంటూ వ్యాఖ్యలు చేశారు.

భారతదేశంలో అతిపెద్ద సమస్య నిరుద్యోగం అని.. నిరుద్యోగం అంశాన్ని ఎక్కడ కూడా చెప్పలేదన్నారు. నిత్యావసర వస్తువుల గురించి పెద్ద పెద్ద మాటలు మాట్లాడిన మోదీ ఎక్కడా ఇప్పుడు ఆ అంశాన్ని చెప్పలేదని విమర్శించారు. రైతులు, పేద వారి గురించి ఎక్కడా మాట్లాడలేదని ఎంపీ మల్లు రవి అన్నారు.

**రైతులు ఉన్న ఏడు కోట్లేనా: ఎంపీ రామసహాయం రఘురాం...** ఈ బడ్జెట్ ఢిల్లీ, బీహార్ ఎన్నికల రాష్ట్రం కొరకు పెట్టినట్టుందని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి అన్నారు. బీహార్ రాష్టానికి మకాన బోర్డు ఏర్పాటు చేస్తామని బడ్జెట్‌లో చెప్పారని.. తెలంగాణకు ఎప్పటి నుంచో రెండో ఎయిర్ పోర్ట్ అడిగామని గుర్తుచేశారు.

రాష్టానికి బడ్జెట్‌లో ఇచ్చింది అంటూ ఏమి లేదన్నారు. దేశంలో 7 కోట్ల మంది మాత్రమే రైతులు ఉన్నారా అందరికీ ఎందుకు కిసాన్ క్రెడిట్ కార్డు ఇవ్వరని ప్రశ్నించారు. తెలంగాణలో భద్రాచలంకు నిధులు ఎందుకు ఇవ్వరని ఎంపీ ప్రశ్నించారు.

**దక్షిణాది రాష్ట్రాలపై చిన్న చూపు: ఎంపీ కిరణ్ కుమార్...** ఈ బడ్జెట్ బీహార్, ఢిల్లీ ఎన్నికల కోసం పెట్టినట్టు ఉందని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. ఉడాన్ స్కీమ్ కింద ఎయిర్ పోర్టులు పెంచుతామని అంటున్నారని.. విమానం టిక్కెట్లపై నియంత్రణ ఉండాలని.. అది లేకుండా ఎయిర్ పోర్టులు పెంచుతామని అంటున్నారన్నారు. ఢిల్లీ గద్దెను దక్కించుకునే ఉద్దేశం చాలా స్పష్టంగా కనిపించిందని తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలను బీజేపీ చిన్నచూపు చూస్తోందని విమర్శించారు. తెలంగాణ చాలా కీలకమైన రాష్ట్రం తెలంగాణ నుంచి కేంద్రానికి నిధులు ఎక్కువగా వస్తున్నాయన్నారు. సీఎం రేవంత్ రెడ్డి గతంలో కేంద్రంలో అందరి మంత్రులను కలిసి తెలంగాణకు ప్రాముఖ్యత కల్పించాలని కోరారన్నారు. మోదీ గుజరాత్ ముఖ్యమంత్రి అనే ఆలోచన నుంచి బయటకు రావాలని.. ఆయన ఈ దేశానికి ప్రధాన మంత్రి అని తెలిపారు. గుజరాత్ వ్యాపారస్తులకు అనుగుణంగా బడ్జెట్ ప్రతిపాదనలు ఉన్నాయని ఎంపీ చామల కిరణ్ కుమార్ అన్నారు.

**అట్టర్ ఫ్లాప్ బడ్జెట్: ఎంపీ వంశీ....** కేంద్ర బడ్జెట్ అట్టర్ ఫ్లాప్ బడ్జెట్ అని కాంగ్రెస్ ఎంపీ గడ్డం వంశీ అన్నారు. రాజకీయం కొరకు బడ్జెట్ ప్రవేశపెట్టారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రాన్ని బడ్జెట్‌లో నిర్లక్ష్యం చేశారని.. బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. తాము ఎన్నో డిమాండ్లు, ప్రతిపాదనలు పెట్టామన్నారు. చాలా బాధాకరంగా ఉందన్నారు. యువత ఉద్యోగ, ఉపాధి లేకుండా కష్టపడుతున్నారన్నారు. అంబానీ, అదానికి కొత్త కొత్త బిజినెస్‌లు దక్కే విధంగా కనిపిస్తున్నాయన్నారు. సింగరేణికి సోలార్ ప్రాజెక్టు, క్లీన్ టెక్ ఎన్నో ప్రతిపాదనలు తాము ఆర్థిక మంత్రికి గతంలో ఇచ్చామని తెలిపారు. దళితులకు పన్నుల్లో ప్రత్యేక రాయితీ ఇవ్వాలని ఎంపీ గడ్డం వంశీ డిమాండ్ చేశారు.

**ఇది డ్రీమ్ బడ్జెట్: కిషన్ రెడ్డి...** పేదలు, మధ్యతరగతి ప్రజలు, రైతుల సంక్షేమానికి బాటలు వేస్తూనే.. అన్ని వర్గాలకు సమన్యాయం చేసే 'డ్రీమ్ బడ్జెట్' ఇది అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకునేలా రూపొందించిన బడ్జెట్ అని అన్నారు. వ్యక్తిగత ఇన్ కమ్ టాక్స్ పరిధిని 12 లక్షలకు పెంచడం చాలా పెద్ద నిర్ణయమని తెలిపారు. ఎమ్ఎస్ఎమ్ఈ, చిన్న పరిశ్రమలకు బడ్జెట్ ఆపన్నహస్తాన్ని అందించిందన్నారు. రాష్ట్రాల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ.. సహకార సమాఖ్య స్ఫూర్తిని గౌరవించిన బడ్జెట్ ఇది అని అన్నారు. అన్ని సంక్షేమ పథకాలకు నిధులను పెంచడం అభినందనీయమన్నారు. ప్రధానమంత్రి మోదీ, ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్‌కు ధన్యవాదాలు తెలియజేశారు కేంద్రమంత్రి.

**ఇది అద్భుతమైన బడ్జెట్: బండి సంజయ్....** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ గతినే మార్చే అద్భుతమైన బడ్జెట్ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. పేద, మధ్యతరగతి, యువత, రైతు సంక్షేమ బడ్జెట్ అని తెలిపారు. రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు విప్లవాత్మకమని చెప్పుకొచ్చారు. తెలంగాణ సహా దేశంలోని ఒక్కో ఉద్యోగికి రూ.80 వేల వరకు ఆదా అవుతుందన్నారు. గత 75 ఏళ్లలో మునుపెన్నడూ లేనివిధంగా మధ్యతరగతికి అనుకూలమైన బడ్జెట్ ఇది అంటూ బండి సంజయ్ అన్నారు.









**దేశమంటే కొన్ని రాష్ట్రాలే అన్నట్లుగా బడ్జెట్: హరీష్ రావు...** 2025-26 బడ్జెట్ తన రాజకీయ అవసరాలే ఉపయోగించుకున్నది తప్ప, దేశ సమ్మిళిత వృద్ధిని ఏమాత్రం పట్టించుకున్నట్లు లేదని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. ఎన్నికలు ఉన్న రాష్ట్రాలకు పెద్ద మొత్తంలో వరాలు ప్రకటించి, ఎన్నికలు లేని రాష్ట్రాల పట్ల వివక్ష చూపడం సరికాదన్నారు. దేశమంటే మట్టి కాదోయో దేశమంటే మనుషులోయ్ అంటూ ప్రసంగించిన నిర్మల సీతారామన్.. దేశమంటే కొన్ని రాష్ట్రాలే అన్నట్లు బడ్జెట్ ప్రవేశ పెట్టడం బాధాకరమన్నారు. మొదటి నుంచి ఇదే దోరణిని ప్రదర్శిస్తూ రాజకీయ అవసరాలు తీర్చుకుంటోందని కేంద్ర ప్రభుత్వం అంటూ హరీష్ వ్యాఖ్యలు చేశారు.

**పేరుకే తెలుగు పడుచు.. కానీ: జగ్గారెడ్డి...** కేంద్ర ప్రభుత్వం పెట్టిన 50 లక్షల కోట్ల బడ్జెట్ పెట్టారని.. . కానీ తెలంగాణ రాష్ట్రానికి, ప్రజలకు ఎలాంటి కేటాయింపులు లేవని కాంగ్రెస్ నేత జగ్గా రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రజలు కోరుకున్నట్టు బడ్జెట్‌లో కేటాయింపులు లేకపోవడం నిరాశకు గురిచేసిందన్నారు. తెలంగాణ నుంచి ప్రజలు కట్టే పన్నులు ఏడాదికి లక్ష కోట్లు అని తెలిపారు. తెలుగు రాష్ట్రాల ఆడబిడ్డలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించకపోవడంతో ఒక ప్రశ్నగా మిగిలిపోయారన్నారు. తెలంగాణ ప్రజలు 8 మంది ఎంపీలను గెలిపించారని.. దీంట్లో ఇద్దరు కేంద్ర మంత్రులు అయ్యారని తెలిపారు. నిర్మలా సీతారాం... పేరుకే తెలుగు ఆడపడుచు అని.. తెలంగాణకు ప్రత్యేక నిధి కేటాయించకోవడం ఆమె రాజకీయ బలహీనురాలిగా భావిస్తున్నామన్నారు. అందుకే తెలంగాణకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించలేకపోయారని వ్యాఖ్యలు చేశారు. ఇది దేశ బడ్జెట్‌లా లేదని.. బీహార్ ఎన్నికల బడ్జెట్‌గా కనపడుతోందని జగ్గారెడ్డి పేర్కొన్నారు.




ప్రభుత్వం ఆదాయపు పన్నులో భారీ మార్పును తీసుకొచ్చి మధ్యతరగతిని ఖుషీ చేసింది. కొత్త పన్ను విధానంలో రూ.12 లక్షల వరకు పన్ను చెల్లించాల్సిన అవసరం లేకపోవడంతో రూ.80 వేలు వరకు మిగిలే అవకాశం ఉంది. ఓవైపు వృద్ధి రేటు తగ్గడం, ప్రజలు కూడా ఖర్చులను తగ్గించుకోవడం, కీలక రాష్ట్రాల్లో ఎన్నికలు వంటి అంశాలు ఉండటంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొంది.

**మరింత ఆకర్షణీయంగా చేయడం..** పాత పన్ను విధానంతో పోలిస్తే కొత్తది చాలా సరళంగా ఉంది. ఇప్పటికే పన్ను చెల్లింపుదారుల్లో దాదాపు 70శాతం మంది దీనిలోకి మారినట్లు గణంకాలు చెబుతున్నాయి. ఇప్పుడు తాజాగా కొత్త దానిలో మరిన్ని శ్లాబ్‌లను తీసుకురావడంతో పాత విధానం ఇక దాదాపు చాలామందికి పెద్దగా లబ్ధి చేకూర్చే పరిస్థితి లేదు.

**మధ్యతరగతికి గాలం..** మోదీ సర్కారు ఆదాయపు పన్నుదారుల విషయంలో దయ చూపడం లేదన్న విమర్శలు ఎప్పటినుంచో ఎదుర్కొంటోంది. చాలా వేదికలపై ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామనే ప్రజల అసంతృప్తిని ప్రత్యక్షంగా చూశారు. 2022లో ప్రైస్ సంస్థ విడుదల చేసిన నివేదిక ప్రకారం దేశ జనాభాలో 43.2 కోట్ల మంది (31శాతం) మధ్యతరగతివారే. 2046 నాటి వారి సంఖ్య 100 కోట్లను దాటేస్తుందన్నది అంచనా. ఇది నాటి జనాభాలో 61 శాతానికి సమానమవుతుంది. తాజాగా దిల్లీ, మరికొన్ని నెలల్లో బిహార్‌లో ఎన్నికలు ఉన్నాయి. ప్రతిపక్షాలు ఇప్పటికే దీనిని బలంగా తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నాయి. పన్ను మినహాయింపుతోపాటు.. తాజాగా అద్దెలపై కూడా టీడీఎస్‌ను రూ.2.4 లక్షల నుంచి రూ.6 లక్షలకు పెంచే నిర్ణయం కూడా మిడిల్ క్లాస్‌ను లక్ష్యంగా చేసుకొన్నదే.

**వినిమయం పెంచేలా..** ప్రభుత్వం తాజాగా పన్ను మినహాయింపు నిర్ణయంతో చెల్లింపుదారులు ఒక్కొక్కరు అత్యధికంగా రూ.80వేలు వరకు లబ్ధి పొందొచ్చు. మొత్తం చూసుకొంటే ఈ రూపంలో ఆర్థికవ్యవస్థలోకి రూ.లక్ష కోట్లు వెళతాయి. దీంతో ఈ నిధులను కొనుగోళ్లు, పెట్టుబడులకు మళ్లిస్తారని అంచనా. దీంతోపాటు వస్తువులను కూడా ఆకర్షణీయంగా మార్చేందుకు కొన్నిరకాల వస్తువులపై పరోక్ష పన్నులను కూడా తగ్గించారు. మొబైల్ ఫోన్లకు విడిభాగాలపై కస్టమ్స్ డ్యూటీ తగ్గించడం వంటివి వీటిల్లో ఉన్నాయి.

**కీలక రంగాలకు మద్దతు..** ఈ బడ్జెట్ నిర్ణయాలతో ఎఫ్ఎంసీజీ, ఆటోమొబైల్, రియల్ ఎస్టేట్ రంగాలకు లబ్ధి చేకూరనుంది. వీటిపైనే పన్ను మిగులు సొమ్మును వినియోగదారులు వెచ్చించే అవకాశాలు ఉన్నాయి.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660